

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



ప్రజాశక్తి - నాయుడుపేట: గురువారం క్రిస్మస్ సందర్భంగా నాయుడుపేట పట్టణంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయ శ్రీ నాయుడుపేట టిడిపి నాయకులతో కలిసి ఈ ప్రార్ధనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పార్ధసారథి, కందల కృష్ణారెడ్డి, కరీంబాయి చెంచయ్య, గూడూరు సుధీర్ రెడ్డి, అవధానం సుధీర్, గుంటూరు లక్ష్మయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పులివర్తి నాని



ప్రజాశక్తి - పాకాల: చంద్రగిరి నియోజకవర్గం, పాకాలలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొని, క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాస్టర్లకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్ధనల్లో ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తిలో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పలు ప్రార్ధనా మందిరాల్లో క్రైస్తవ సోదరులు సోదరీమణులు క్రీస్తును ఆరాధిస్తూ ప్రార్ధనలు చేశారు. స్థానిక లూథరన్ చర్చిలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. క్రిస్మస్



వేడుకల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సైతం లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

విశ్వానికి శాంతి దూత క్రీస్తు

: కురగొండ సొసైటీ చైర్మన్ అంకయ్య



ప్రజాశక్తి - ఓజిలి: విశ్వశాంతిని కాంక్షించే వాళ్ళల్లో మొదటగా క్రీస్తుని ప్రతి ఒక్కరు గుర్తు చేసుకోవాలని ఆయన తన రక్తాన్ని చిందించి ప్రజల కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ మహనీయుడని, శాంతి దూత అనీ అందుకే ఆయన పుట్టినరోజు అయినటువంటి ఈ క్రిస్మస్ ను ప్రేమకు కారుణ్యానికి త్యాగానికి ప్రతీక గాజరుపుకుంటారని కురుగొండ సొసైటీ చైర్మన్ డాక్టర్ ధారా అంకయ్య తెలిపారు. ప్రతి ఒక్క క్రిస్టియన్ మంచి మార్గంలో నడుస్తూ విశ్వశాంతికి పాటు పడాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదానం చేసి ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: మండలంలోని అన్ని చర్చల్లో క్రైస్తవులు క్రిస్మస్ పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని అన్ని చర్చిల్లో గురువారం ఏసుక్రీస్తు జన్మదిన



వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈబీసీ కాలనీ జై సిలువ ప్రార్ధనా మందిరంలో నిర్వహించిన ప్రార్ధనల్లో సూళ్లూరుపేటకు చెందిన దైవ సేవకులు రెవరెండ్ శాంతి బాబు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేసి, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జితేంద్ర నాయుడు నాయుడు, మురళి, సురేష్, మంగారావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణం, స్థానిక ఎన్జీవో కాలనీ చర్చ్ ఆఫ్ క్రైస్ట్, పాస్టర్ సెల్వం



ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, కే.విజయ్ కుమార్, జోజో, జీవన్ బాబు, బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : యేసు క్రీస్తు లోక రక్షకుడని గూడూరు, సార్వత్రిక క్రైస్తవ ప్రార్ధన



మందిరం పాస్టర్ డానియేల్ వులా రవికుమార్ పేర్కొన్నారు. గురువారం క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చిలో పాస్టర్ ప్రశాంత్ కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అంబేద్కర్ నగర్, హోసన్నా ప్రార్ధన మందిరంలో ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి.

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): క్రిస్మస్ పర్వదినాన్ని పురసంచుకొని తిరుపతి నగర పరిధిలోని కనక



భూషణ్ లేఅవుట్, షెకీనా ప్రార్ధన మందిరంలో పాస్టర్ జోయల్ జెబస్టిన్ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించినట్లు సీనియర్ పాస్టర్ అరుల్ అరసు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారన్నారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరిలో క్రిస్మస్ పండుగ వేడుకలను క్రైస్తవులు గురువారం ఘనంగా



నిర్వహించుకున్నారు. చర్చి వీధిలోని ఆంధ్రా లూథరన్ లుక్ చర్చిలో కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందిరికి పంచిపెట్టారు. అనంతరం ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. రెడ్డివారిపల్లె సమీపంలోని గడ్సిమ్టన్ హెూలీ మినిస్టరీలో ప్రత్యేక పార్ధనలు చేశారు. నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేసి, మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాలలో పాస్టర్ ప్రభు ప్రేమ్ కుమార్, ఎలియాజర్, అబ్రహం, తబితగ్రేస్, తదితరులు పాల్గొన్నారు. సప్తగిరి కాలనీ, సైయింట్ పాల్ చర్చిలో క్రీస్తు జన్మదినాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రేవరెండ్ పాల్రాజ్, ముని, తదితరులు పాల్గొన్నారు.

ప్రేరణ హెల్పింగ్ సొసైటీచే క్రిస్మస్ వేడుకలు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాలతో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రేరణ బృందం శాంటా క్లాజ్‌తో కలిసి నాలుగు ఎన్‌జీవోలను సందర్శించి, అక్కడి పిల్లలు, వృద్ధులతో కలిసి క్రిస్మస్ పండుగను ప్రత్యేకంగా జరుపుకుంది. ఈ వేడుకల ద్వారా ప్రత్యేక ప్రతిభ కలిగిన పిల్లలు, దృష్టి భిన్నత కలిగిన పిల్లలు, అనాథ బాలబాలికలు, వృద్ధాశ్రమాల్లో నివసిస్తున్న వృద్ధులు ఆనందంగా భాగస్వాములయ్యారు.

కామ్రేడ్ మునెమ్మ అమర్‌రహే..!

సిపిఎం, ప్రజాశక్తి నివాళి



మునెమ్మ ఫైల్‌ఫోటో, సిపిఎం నివాళి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తిరుపతి జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్యకు సతీ వియోగం కలిగింది. ఆయన భార్య అంగేరి మునెమ్మ(54) గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. రాజీవ్ నగర్‌లోని పుల్లయ్య నివాసం నుండి మునెమ్మ అంత్యక్రియలు నిర్వహించగా, సిపిఎం శ్రేణులు నివాళి అర్పించి, అండగా నిలిచాయి. తిరుపతి జిల్లా సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో మునెమ్మ మృతదేహంపై ఎర్ర జెండా కప్పి జోహార్లు అర్పించారు. మునెమ్మ అమర్ రహే అంటూ నినదించారు. అనంతరం పుల్లయ్యకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరుస్తూ పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళీ, ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, దాసరి జనార్ధన్, పెనగడం గురువయ్య, రెడ్డిపల్లి సురేష్, గెడి వేణు, శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు మునెమ్మకు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

■ సిఐటియు సంతాపం..

సిఐటియు శ్రేయోభిలాషి, ప్రజాతంత్ర ఉద్యమ నాయకురాలు సిఐటియు నేత అంగెరి పుల్లయ్య సతీమణి అంగేరి మునెమ్మ హఠాన్మరణానికి సిఐటియు రాష్ట్ర –పాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మునెమ్మ మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి వారి కుటుంబ సభ్యులకు తీవ్ర లోటుగా పేర్కొన్నారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు .

■ పాడె మోసిన కూతుళ్లు..

త్యాగమూర్తి, ఆదర్శ మహిళ మునెమ్మ పాడెను తండ్రి అంగేరి పుల్లయ్యతో కలిసి ముగ్గురు కూతుళ్లు మోశారు. పెద్ద కుమార్తె దివ్య, రెండో కుమార్తె హేమలత, మూడో కుమార్తె వాణిలు తల్లి పాడెను మోస్తూ విప్లవ నినాదాలు చేశారు. వీరితో పాటు మునెమ్మ మనుమళ్లు, మనుమరాళ్లు కూడా పాడె మోసి అంతిమయాత్ర వరకు కొనసాగారు. మునెమ్మది చివరి మజిలీ అయినా ఆమె ఆశయాలు మాలో బతికే ఉన్నాయని చాటి చెప్పారు. మునెమ్మ కోరిక మేరకు పార్టీ పద్ధతుల ప్రకారం అంతిమయాత్ర నిర్వహిస్తున్నామని భర్త అంగేరి పుల్లయ్య వెల్లడించారు. పెద్ద కుమార్తె దివ్య ప్రజాశక్తిలో సీనియర్ సబెడిటర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త వాడ గంగరాజు చిత్తూరు జిల్లా సిపిఎం కన్వీనర్‌గా ఉన్నారు. మొదటినుంచి పార్టీ సిద్దాంతాలకు కట్టుబడి తమ కుటుంబం ఉందని దివ్య అన్నారు.

■ ప్రజాశక్తి నివాళి..

మునెమ్మ మృతదేహానికి ప్రజాశక్తి కుటుంబం నివాళి అర్పించింది. సబెడిటర్ దివ్యను ఓదార్చింది. ప్రజాశక్తి మేనేజర్ సిఎస్ ప్రసాద్, బ్యూరో ఇంచార్జి వళిగలం గోపి, డెస్క్ ఇంచార్జి అవనిగడ్డ వనజ, జిల్లా ఇంచార్జి శ్రీనివాసులు, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి సురేష్, డివిజన్ ఇన్‌ఛార్జి కిషోర్, విలేకరులు కామేష్, వెంకటేష్ ఉన్నారు.

మనుస్మృతిని మంటగలుపుదాం



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: అసమానతలకు మూలమైన మనుస్మృతిని మంటగలిపి కోట్లాదిమంది ప్రజలకు సమాన అవకాశాలు, హక్కులు కల్పించిన భారత రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడు రక్షించుకోవలసిన అవసరం ఉందని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక ఎంఆర్ పల్లి ఆర్పిఐ ఆఫీసులో మనుస్మృతిని డాక్టర్ బి.ఆర్ .అంబేద్కర్ ఎందుకు తగలబెట్టారు అనే అంశంపై రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు, పి.అంజయ్య అధ్యక్షతన గురువారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర –పాధ్యక్షులు క్రాంతి చైతన్య, ప్రముఖ రచయిత గొడుగు చింత గోవిందయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి చినశీం పెంచలయ్య, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం (జీవకోన) అధ్యక్షులు సి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రెండు వేల సంవత్సరాల ముందు వచ్చిన మనుస్మృతి వందలాది సంవత్సరాలుగా పురుషాధిక్యత, కులాధిక్యత సమాజాన్ని పెంచి పోషిస్తూ, మహిళల జీవితాలపై తరతరాలుగా జరిగిన వివక్షత, దోపిడీకి ఒక చట్టబద్ధత లాగా పనిచేసిందన్నారు. దీన్ని గుర్తించిన డాక్టర్ బి.ఆర్ .అంబేద్కర్ 1927 డిసెంబర్ 25వ తారీఖున మహారాష్ట్ర రాయగడ్ జిల్లా మహద్ అనే గ్రామంలో వేలాది మంది సమక్షంలో మనుస్మృతిని తగలబెట్టారని తెలిపారు. రాజ్యాంగం ద్వారా రక్షణ కల్పించబడిన దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, అత్యంత వెనుకబడిన కులాలు ఈనాటికీ రాజ్యాంగం అమలు చేయమని తపిస్తుంటే, మనువాదాన్ని ఆచరిస్తున్న ఉన్నతట కులాలు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మనువాదాన్ని తిరిగి కోట్లాదిమంది భారతీయులపై బలవంతంగా రుద్దడానికి ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ చాందస్ సంస్థలు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రజలు చైతన్యవంతులై రాజ్యాంగాన్ని రక్షించుకోవలసిన అవసరం బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని సశ అభిప్రాయపడింది. ఈ కార్యక్రమంలో ఏపీ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు చందమామల కోటయ్య, ఆర్పిఐ జిల్లా అధ్యక్షులు ఏ.సుబ్రహ్మణ్యం, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు బాబు, నందయ్య, హరిబాబు, బీసీ నాయకులు మణికుమార్, మైనార్టీ నాయకులు గవరశీర్ భాష, బొజ్జా తారకం కాలనీ అధ్యక్షులు మేకల బాబు, ప్రధాన కార్యదర్శి పి.నాగేంద్ర మొగిలిప్ప, గోపాలకృష్ణ, బాలోత్సవం జిల్లా అధ్యక్షులు నడ్డి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

– పాకాలలో మనుధర్మ దహన సభ జరిగింది. కార్యదర్శి డిఆర్ ప్రకాష్ మాట్లాడుతూ



మనుధర్మ ప్రతులను దహనం చేస్తున్నదృశ్యం

అసమానతలకు, అన్యాయాలకు, అక్రమాలకు, అవినీతికి, వివక్షకు ప్రతిరూపం మనుధర్మశాస్త్రం అన్నారు. ఎంఇఒ బాబ్జీ మాట్లాడుతూ భారత రాజ్యాంగమే విముక్తి మార్గం అన్నారు. అంబేద్కర్ మార్గంలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజా, శివంప్రసాద్, మధు, ఉదయ్, రాజేంద్ర, ఆంజనేయులు పాల్గొన్నారు.

స్థానికులకు ప్రత్యేక దర్శనం కల్పించాలి



పరిపాలనా భవనం ఎదుట ధర్నా చేస్తున్న చింతామోహన్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: వైకుంఠ ఏకాదశి రోజు స్థానికులకు ప్రత్యేక దర్శనం కల్పించాలని, స్వామి వారికి భక్తితో ఇచ్చిన బంగారు లెక్కలు బయటపెట్టాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం టిటిడి పరిపాలన భవనం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు భక్తితో ఇచ్చిన బంగారం లెక్కలపై దేశమంతా కొన్ని విమర్శలు వస్తున్నాయని, భక్తులు ఎన్ని కిలోల బంగారం ఇచ్చారు? లెక్కల్లో ఉన్న బంగారం ఎంత? ఆ బంగారం ఎక్కడ పెట్టారు? వారం లోపల టీటీడీ యాజమాన్యం వివరణ ఇవ్వాలన్నారు. టీటీడీ భూములు వందల ఎకరాలు ఉన్నాయని, కార్పొరేట్ సంస్థలకు ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వడానికి వీల్లేదన్నారు. ఇప్పటి వరకు కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన భూములను వెనక్కి తీసుకోవాన్నారు. అలా జరగకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సామాన్య భక్తులకు దర్శనం విషయంలో పెద్దపీట వేస్తామని అంటున్నారే, కానీ అది మాటలకే పరిమితమైందన్నారు. ఆచరణలో అమలు కావడం లేదన్నారు. కార్పొరేట్ వ్యక్తులకు మాత్రమే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వివిఐపిలకు ఇస్తున్న దర్శనాల లెక్కలు రోజువారీగా బయటపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, రవి, తేజోవతి, శాంతి యాదవ్, ముని శోభ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూల విక్రయ కేంద్రంలో టీటీడీ చైర్మన్ తనిఖీలు



లడ్డు విక్రయ కేంద్రం వద్ద భక్తులతో టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలోని శ్రీవారి లడ్డూల విక్రయ కేంద్రంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు గురువారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి స్వయంగా కౌంటర్ వద్దకు వెళ్లి లడ్డూల జారీ విధానాన్ని, సిబ్బంది పనితీరును, లడ్డూ బరువును తనిఖీ చేశారు. అనంతరం లడ్డూ కౌంటర్ లోని కియోస్క్ యంత్రం వద్ద దర్శనం కాని భక్తులకు ఆధార్ నమోదు ద్వారా యూపీఐ చెల్లింపు చేసి లడ్డూలు పొందే విధానాన్ని పరిశీలించి భక్తుల నుండి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత బూందీ పోటుకు వెళ్లి బూందీ తయారీని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించడంలో భాగంగా లడ్డూ విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం టీటీడీ రోజుకు 4 లక్షల లడ్డూలు, 8 వేల కల్యాణోత్సవ లడ్డూలను భక్తులకు విక్రయిస్తోందని తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా లడ్డూల కొరత లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. లడ్డూల నాణ్యత, రుచి, క్యూ లైన్లలో వేచి ఉండే సమయం తగ్గించడం వంటి సౌకర్యాలపై భక్తులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో లడ్డూల ఉత్పత్తిని పెంచి కౌంటర్ల వద్ద త్వరితగతిన భక్తులు లడ్డూలు పొందే విధంగా ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు. ఈ తనిఖీల్లో చైర్మన్ వెంట శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పోటు పేష్కార్ముని రత్నం ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 30గంటలు

శ్రీవారి భక్తులలతో తిరుమల కిక్కిరిసిపోయింది. వరుస సెలవులతో రద్దీ విపరీతంగా పెరగడంతో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. క్యూలైన్లలోకి భక్తుల అనుమతిని తాత్కాలికంగా నిలిపివేసింది. ప్రస్తుతం క్యూలైన్లు అన్నీ నిండిపోగా.. దర్శనానికి ఏకంగా 30 గంటల సమయం పడుతోంది. తిరిగి రేపు ఉదయం 6 గంటలకు మాత్రమే భక్తులను క్యూలైన్లలోకి అనుమతిస్తామరని అధికారులు స్పష్టం చేశారు.

సిఎం పర్యటనకు పక్కా ఏర్పాట్లు



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఈ నెల 26న శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అందరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం ముఖ్యమంత్రి పాల్గొననున్న సంస్కృత విద్యాపీఠం, డిస్ట్రిక్ పోలీస్ ఆఫీస్ వద్ద ఏర్పాట్లను, ముఖ్యమంత్రి వెళ్లే మార్గాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు లేకుండా పూడ్చాలని, డివెడర్లకు రంగులు వేయాలని తెలిపారు. డివెడర్ల మధ్యలో మొక్కలు ఏర్పాటు చేయాలని, రోడ్లపైన మట్టి లేకుండా శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలరని సూచంచారు. అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగ్గా చేపట్టాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలో కేటాయించిన విధులను వారు అప్రమత్తంగా, బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. కమిషనర్ వెంట టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్ పాల్గొన్నారు.

నేడు తిరుపతికి రానున్న చంద్రబాబు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న ఉదయం 8.10 గంటలకు ఉండవల్లి నుండి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి ఉదయం 9:35 గంటలకు తిరుపతి ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారని తెలిపారు. అనంతరం అక్కడ నుండి బయలుదేరి ఉదయం 10.05 గంటలకు సంస్కృత విద్యాపీఠానికి చేరుకుని 12 గంటల వరకు భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం అక్కడి నుండి బయలుదేరి మధ్యాహ్నం 1.10 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుని జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారన్నాఉరు. అనంతరం 1.35 గంటలకు బైరాగి పట్టెడ లోని (మీడియా కోఆర్డినేటర్) శ్రీధర్ వర్మను తన గృహంలో కలవడానికి వెళ్తారని తెలిపారు. ఈ కార్యక్రమ అనంతరం 2.05 గంటలకు ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని ఉండవల్లికి తిరిగి ప్రయాణం కానున్నారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పెందుర్తిని కలిసిన డాలర్స్ దివాకర్‌రెడ్డి

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో తిరుపతికి విచ్చేసిన సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌ను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు.



రాజారెడ్డికి ఉత్తమ వినియోగదారుని అవార్డు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: జాతీయ వినియోగదారుల వారోత్సవాలు రాష్ట్ర స్థాయిలో జరిగిన ముగింపు కార్యక్రమం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. రాష్ట్ర స్థాయి ఆత్తమ వినియోగదారుల ఉద్యమ కర్తగా ఏపీ రాష్ట్ర బెస్ట్ వినియోగదారుడు, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు రాజారెడ్డి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ ఢిల్లీ రావు, రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ డైరెక్టర్ గోవిందరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా, ఏ.పీ. రాష్ట్ర లీగల్ మెట్రాలజీ డైరెక్టర్



కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

'ఐలు' చిత్తూరు జిల్లా కమిటీ రద్దు

■ తొమ్మిదిమందితో కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, చిత్తూరు జిల్లా కమిటీ ఎర్పాటు అయినప్పటినుంచి ఇప్పటివరకు రాష్ట్ర కమిటీ ఇచ్చిన కార్యక్రమాలు నిర్వహించడంగానీ, స్వతంత్రంగా కార్యక్రమాలు నిర్వహించడంగానీ జరగనందున ఆ కమిటీని రద్దు చేస్తూ ఈ నెల 8వ తేదీన జరిగిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశంలో తీర్మానించినట్లు ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. సంఘం కార్యకలాపాలకు ఆటంకం జరగకుండా ఉండేందుకు, త్వరలో జరగనున్న బార్ కౌన్సిల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు తొమ్మిది మందితో కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తిరుపతి నుండి పత్తికొండ మురళి, హేమచంద్ర రెడ్డి, చల్లా వెంకటయ్య, భాను చందర్, మదనపల్లి నుండి షాజహాన్ భాష, పివీ ప్రసాద్, సోమశేఖర్, చిత్తూరు నుండి సుగుణ శేఖర్ రెడ్డి, శ్రీకాళహస్తి నుండి అంకయ్యలు సభ్యులుగా ఉంటారని ఐలు రాష్ట్ర కార్యదర్శి వర్గం తీర్మానించినట్లు తెలిపారు. నూతన కమిటీ ఎన్నిక జరిగే వరకు ఈ కమిటీకి గౌరవ అధ్యక్షులుగా పి.హేమచంద్ర రెడ్డి, కన్వీనర్‌గా పత్తికొండ మురళి వ్యవహరిస్తారన్నారు. ఎపి బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఎంపిక చేసిన అభ్యర్ధి సత్తు అంకయ్యకు తప్ప మరో అభ్యర్థికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఎవరి మద్దతు ఇవ్వడం లేదని తెలిపారు. త్వరలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ అభ్యర్ధి సత్తు అంకయ్యకు ఐలు కార్యకర్తలు, న్యాయవాదులు తమ ప్రాధాన్యత ఓటును వేసి ఆయన గెలుపుకు సహకరించాలని మాధవరావు విజ్ఞప్తి చేశారు.

నెలాఖరులోగా పన్ను చెల్లించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ నెలాఖరులోగా మున్సిపల్ పన్నులు చెల్లించాలని కమిషనర్ భవానీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 2025 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ జాగా పన్నులను జరిమానా లేకుండా చెల్లించేందుకు ఇదే చివరి అవకాశమని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ, లేకుంటే వచ్చే ఏడాది మరిన్ని అదనపు జరిమానాలరే గురి కావాల్సి ఉంటుందని హెచ్చరించారు.

డాక్టర్ రవిరాజుకు ఘన సన్మానం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అంతర్జాతీయ వాకర్స్ అసోషియేషన్ అధ్యక్షులుగా డాక్టర్ రవిరాజు, సెక్రటరీగా కోనేటి రవిరాజు, కోశాధికారిగా మునికృష్ణ యాదవ్‌లచే విశాఖపట్నం, వుడా చిల్డ్రన్స్ అరేనాలో రామానన‌దం పిఐపి, ప్రభావతి ఐపిలు ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ ప్రతి పట్టణంలో వాకర్స్‌కు ఐడి కార్డ్స్ మంజూరు చేస్తామని తెలిపారు. అసోషియేషన్ తరపున పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ వాకర్స్ అసోషియేషన్ అధ్యక్షులు, సెక్రటరీ, ట్రెజరర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.బాబు, వైస్ ప్రెసిడెంట్ కె.చంద్రబాబు, కార్యదర్శి హెచ్.రామ్మోహన్ వర్మ, కోశాధికారి ఆర్.రమేష్ రాజు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ




ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదలైన చెక్కులను గురువారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ లబ్దిదారులకు అందచేశారు. పుత్తూరు టౌన్, గోవిందపాలెంకు చెందిన ఎం.మదన్ కుమార్‌కు రు.5,00,000, గేట్ పుత్తూరుకు చెందిన దోని గణేష్ రు.48,623, ఆర్.బాబుకు రు.20,000, కె.తులసమ్మకు రు.82,158, సి.ఎన్. కండ్రిగకు చెందిన అరుల్ మణికి రు.20,000, పన్నూరుకు చెందిన క్రిష్ణయ్యకు రు.83,657, జగన్నాధపురానికి చెందిన రఘుపతికి రు.44,665, వడమాలపేట మండలం, పూడి దళితవాడకు చెందిన కె.మునిరత్నంకు రు.61,455, నగరి టౌన్, ఏకాంబరకుప్పంకు చెందిన జ్ఞాన సుందరికి 1,40,000 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా అధ్యక్షుడు షణ్ముగం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, డిజి ధనపాల్ పాల్గొన్నారు.

పరంధామ్ యాదవ్‌కు అభినందన




ప్రజాశక్తి - రామచంద్రాపురం (తిరుపతి రూరల్): చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ కార్యదర్శిగా చంద్రగిరి నియోజకవర్గం, వేదాంతపురానికి చెందిన చెరుకుల పరంధామ్ యాదవ్ నిమతులయ్యారు. చెరుకుల పరుధామ్ యాదవ్ తిరుపతి రూరల్ మండలం, వేదాంతపురం గ్రామ పంచాయతీకి గ్రామ కమిటీ టిడిపి అధ్యక్షుడిగా టీడీపీ విజయానికి, అభివృద్ధికి కృషి చేశారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలను ఎమ్మెల్యే పులివర్తి నాని గుర్తించి, టిడిపి పార్టీ పదవులు కట్టపెట్టారని ఆయన తెలిపారు. గురువారం ఎమ్మెల్యేను టిడిపి కార్యాలయంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేస్తానని పరంధామ్ యాదవ్ తెలిపారు. పరంధామ్ యాదవ్‌ను స్థానిక టిడిపి నాయకులు శ్యామ్ బాబు, రఘురామిరెడ్డి, మాజీ సర్పంచ్ చిరంజీవి రెడ్డి, ఢిల్లీ బాబు, మాధవ్, చంద్ర, ప్రసాద్‌లు అభినందించారు.

కార్యకర్త కుటుంబానికి బొజ్జల పరామర్శ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఇటీవల మృతి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త చెలికం శ్రీనివాసులు రెడ్డి కుటుంబాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పరామర్శించారు. శ్రీనివాసులు రెడ్డి కర్మ క్రియలు శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరులో గురువారం జరిగాయి. బొజ్జల సుధీర్ రెడ్డి హాజరై నివాళులు అర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మెహర్ రమేష్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రముఖ సినీ దర్శకుడు మెహర్ రమేష్ గురువారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందివ్వగా, కొట్టే సాయి ప్రసాద్ ముక్కంటి తీర్థప్రసాదాలు జ్ఞాపికలను అందించారు.

పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం వెంకటగిరి నియోజకవర్గం, రాపూరు మండలం పెనుశిల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన 2026వ నూతన సంవత్సర క్యాలెండర్‌ను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గురువారం నెల్లూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాలెండర్‌లో ఆలయ చరిత్ర, స్వామివారి మహిమ, ముఖ్యమైన పర్వదినాలు, ప్రత్యేక సేవల వివరాలను పొందుపరచడం భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, భవిష్యత్తులో మరింత సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాయలసీమ రైతు బతుకు "నాగేటి తడి"



ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు సెనేట్ హాల్లో విశ్రాంత ఆచార్యుడు నాగోలు కృష్ణారెడ్డి రాసిన దీర్ఘకవితా సంపుటి "నాగేటి తడి" పుస్తకాన్ని వర్సిటీ రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడులు గురువారం ఆవిష్కరించారు. ఉపన్యాసకులుగా కిరణ్ క్రాంత్ చౌదరి, భూమన్ పాల్గొన్నారు. పుస్తక సమీక్షను తెలుగు విభాగం మేడిపల్లి రవికుమార్ చేశారు. ఈ కార్యక్రమాన్ని యస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ సంచాలకులు ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సాహిత్యంతో సంబంధం లేకపోయినా ఒక్కసారి ఈ కవిత్వం చదివితే రైతు రూపం, కష్టాలు పూర్తిగా తెలుస్తాయని, తాను పుట్టి పెరిగిన ఉత్తరాంధ్ర రైతుల జీవితం లాగానే రాయలసీమ రైతుల దయనీయంగా కనిపిస్తోందన్నారు.రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ సూర్యుడి కంటే ముందు లేచే రైతు జీవితం తాను గ్రామంలో చూసిన విధంగా కృష్ణారెడ్డి కవిత్వం ఉందన్నారు. ఆచార్య కిరణ్ క్రాంత్ చౌదరి మాట్లాడుతూ రైతు గురించి చెప్పాలంటే రైతు జీవితం అనుభవించి ఉండాలని, పుస్తక కర్త తన తండ్రి రైతుగా పడిన బాధలను అక్షరబద్ధం చేసినా, అది అందరికీ చెందిందని అన్నారు. రాయలసీమ హక్కుల కోసం పోరాడిన భూమన్ మాట్లాడుతూ కృష్ణదేవరాయల కాలం నాటి కాలువలు చెరువులు ఇప్పటికీ వున్నాయని, అలాంటి సాగునీటి వ్యవస్థ రూపుదిద్దుకుంటే రాయలసీమ రైతు బాగుపడుతాడన్నారు. ఈ పుస్తకాన్ని సమీక్షిస్తూ ఆచార్య మేడిపల్లి రవికుమార్ ఉద్వేగపూరితంగా ప్రసంగించారు. రైతు జీవితంతో తనకు అనుబంధం లేకపోయినా, "నాగేటి తడి" చదివితే మామూలు మనిషి కాలేమని అన్నారు. కవిగా తొలి ప్రయత్నం చాలా లోతైనదని,ఆరుగాలం కష్టపడి పని చేస్తే, ఆ పంట ప్రకృతి వైపరీత్యాల పాలు, మధ్యవర్తుల దోపిడీకి పోవడాన్ని కృష్ణారెడ్డి బాగా చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాసాని, కొత్వాలు అమరేంద్ర, కృష్ణస్వామి రాజు, మల్లీశ్వర రావు, మన్నవ గంగాధర ప్రసాద్, పూర్వ రిజిస్ట్రార్లు సత్యవేలు రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఆచార్య గోవిందరాజు, నూనె అంకమ నాయుడు, రాజశేఖర్, సంతోష్ కుమాం, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఘనంగా శంకర్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో సత్యవేడు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం సమన్వయకర్త కూరపాటి శంకర్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం బస్టాండ్ ఆవరణలో తెలుగుదేశం మండల ప్రెసిడెంట్ సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కూరపాటి శంకర్ రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరెన్నో పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్‌చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ కన్నయ్య నాయుడు, ఎంపీటీసీ మనోహర్ నాయుడు, సింగల్ విండో చైర్మన్ భాస్కర్ యాదవ్, రవి నాయుడు, మణి చంద్ర నాయుడు, మధు నాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగలాపురం మండలం పరిధిలోని గ్రామాల్లో..


ప్రజాశక్తి - నాగలాపురం: సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం ప్రోగ్రాం సమన్వయకర్త కూరపాటి శంకర్ రెడ్డి జన్మదిన వేడుకలను నాగలాపురం మండల పరిధిలోని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. నాగలాపురం గాంధీ విగ్రహం కూడలిలో టీడీపీ అధ్యక్షులు శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సుబ్బానాయుడు కండ్రిగలో సురుటుపల్లి పాలకమండలి సభ్యులు శ్రీనివాస నాయుడు ఆధ్వర్యంలో శంకర్ రెడ్డిని గజమాలతో సత్కరించారు. పేద ప్రజలకు దుప్పట్లను, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రామ్ సమన్వయకర్తగా బాధితులు చేపట్టారన్నారు. అయితే పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రణీత్ రెడ్డి, రాకేష్ నాయుడు, పార్తిబన్, నమశ్శివాయ, ఆటో బాలాజీ రాయల్, మధు యాదవ్ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

శ్రీ పల్లి కొండేశ్వర స్వామి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ



సురుటుపల్లి శ్రీ పల్లికొండ ఈశ్వర స్వామి దేవస్థాన క్యాలెండర్ - 2026 ను నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు హంస రుద్రయ్య, కృష్ణయ్య, శ్రీనివాసులు, జయంతి ముని కుమార్, దేవి తదితరులు పాల్గొన్నారు.

గురవమ్మ కర్మక్రియల్లో పాల్గొన్న నూకతోటి రాజేష్



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: పల్లమాల గ్రామంలో వైస్సార్సీపీ నాయకుడు చిరంజీవి మాతృమూర్తి తోటంబేటి గురవమ్మ కర్మక్రియలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్సార్సీపీ సత్యవేడు ఇంచార్జ్ నూకతోటి రాజేష్, వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు కె.మణి నాయుడు హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఉగ్గుముడి గురునాథం, జిల్లా క్రియాసీలక కార్యదర్శి జొన్నల గోపాల్ రెడ్డి, అజయ్ రెడ్డి, ఎంప్లాయ్ వింగ్ సుబ్రహ్మణ్యం, యాకోబు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతిలో జరిగే శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ వందేళ్ల ఘనమైన చరిత్రతో శతాబ్ది వార్షికోత్సవాలు సిపిఐ జరుపుకుంటుందన్నారు. శుక్రవారం బైరాగి పట్టెడ, రాయలసీమ కాలేజీ వద్ద నుండి గంధమనేని శివయ్య భవన్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ నేత నారాయణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

భూదేవి కాంప్లెక్స్ వద్ద లాఠీచార్జ్ ఫేక్ న్యూస్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులపై పోలీసుల లాఠీచార్జ్ జరిగిందని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో, ప్రచారం పూర్తిగా అవాస్తవమని, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మీడియా ముఖంగా స్పష్టం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లాఠీచార్జ్ జరిగిందనే ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదన్నారు. భక్తులను భయాందోళనలకు గురిచేసే ఉద్దేశంతో తప్పుడు వీడియోలు, తప్పుడు కథనాలు ప్రచారం చేయడం అత్యంత బాధ్యతారాహిత్య చర్య అని పేర్కొన్నారు. వాస్తవంగా శ్రీవారి ఎస్ఎస్డి దర్శన టోకెన్ల కోసం భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులు బారులు తీరిన నేపథ్యంలో, అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది అప్రమత్తమై భక్తులను శాంతియుతంగా, క్రమబద్ధంగా క్యూలైన్లలోకి పంపించారని తెలిపారు. లాఠీచార్జ్ అంటూ భయాందోళనలు సృష్టించే విధంగా అవాస్తవ సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వదంతులు నమ్మొద్దని, ధృవీకరించబడిన అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దారు లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల నూతన తహశీల్దారుగా లక్ష్మీనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న శ్రీదేవి బదిలీపై తిరుపతిజిల్లా గూడూరు ఆర్డీవో ఆఫీస్ వెళ్లారు. ఆమె స్థానంలో తిరుపతి జిల్లా కలెక్టరేట్లో పని చేస్తున్న లక్ష్మీనారాయణ బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో తాశీల్దారుగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కులం, ఆదాయం ధ్రువపత్రాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరువచేసి మండలాన్ని అభివ ృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. మండలంలో ఏ ఒక్కరు కూడా రెవెన్యూ కార్యాలయంలో సకాలంలో పనులు జరగడం లేదని ఫిర్యాదులు రాకూడదని అలా వచ్చిన వెంటనే వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. డిప్యూటీ తహశీల్దారు, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున రెడ్డి కంప్యూటర్ ఆపరేటర్లు, రెవిన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు ఆయనను సన్మానించారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి -కోట : ఎంవి రావు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు స్వర్గీయ ముప్పవరపు ఆదిలక్ష్మి వర్ధంతి సందర్భంగా గురువారం చెందోడు గ్రామంలోని ఎంవి రావు నివాసంలో ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం వస్త్ర పంపిణీ నిరుపేదలకు నిర్వాహకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, విజయలక్ష్మి హరిప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలుజు కాలువ ఆక్రమణ తొలగించండి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి గ్రామీణ మండలం, పాడిపేటలో పారుతున్న చెరువు కలుజు కాలువను ఆక్రమించి, పారే నీటిని పట్టా భూమి వైపు మళ్లించి గ్రామానికి చెందిన మాలేపాటి భాస్కర్ నాయుడు, ఆయన తండ్రి మొగలి నాయుడు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ సమస్యపై 2021 నుండి ప్రభుత్వ అధికారులకు, ప్రస్తుత ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా కూడా పరిష్కారానికి నోచుకోలేదని గ్రామ రైతు మునికృష్ణమ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. నక్కల వంకలో కలిసే నీటిని ఎకరాకుపైగా కలుజు కాలువ ఆక్రమణ చేయడంతో తమ పొలాల్లోకి నీరు రావడంతో పంటలు పండించుకోలేక, ఆవులకు పశుగ్రాసం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాను కూడా టీడీపీ ఆవిర్భావం నుంచి నేటి వరకు కొనసాగుతున్నానని, సొంత పార్టీ వారి సమస్యలు పరిష్కరించడం లేదని, రెవిన్యూ అధికారులు సర్వేయర్ సర్వే చేస్తేనే తాము కాలువ పనులు చేపడతామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారని, ఇలా కాలయాపన చేస్తున్నారే గానీ పరిష్కారం చూపడం లేదన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ తీసుకొని పాడిపేట గ్రామస్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కోదండరామిరెడ్డి, దామోదరనాయుడు, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

జడ శ్రావణ్ కుమార్ వ్యాఖ్యలు అభ్యంతరకరం




ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ న్యాయమూర్తిగా పనిచేసిన జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, ఉద్దేశపూర్వకంగా పవన్ కళ్యాణ్ గురించి అవహేళనగా మాట్లాడితే అదే రీతిలో స్పందిస్తామని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు బత్తెన మధుబాబు స్పష్టం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టపడే తత్వం గలిగిన పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో మానవతా కార్యక్రమాలను చేశారని, ఎంతోమంది కౌలు రైతులకు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయాన్ని చేసిన మంచి మనసు కలిగిన వారన్నారు. దేశానికి ఖ్యాతి తెచ్చిన మహిళల అంధుల క్రికెట్ క్రీడాకారులకు లక్ష రూపాయలు చొప్పున సహాయం చేశారన్నారు. అటువంటి పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు జడ శ్రావణ్ కుమార్ చేయడం దారుణమని, ఇతర ఇటువంటి వ్యాఖ్యలు మానుకోవాలని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో హిమవంత్ రాయల్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో శరవేగంగా వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శరవేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. డిసెంబర్ 30వ తేదీన నిర్వహించే వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గురువారం ప్రత్యేకంగా సమీక్షించారు. ఆలయంలోని కల్యాణ మండపంలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమై చర్చించారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉదయం 3.30 గంటల నుంచే వైకుంఠ ద్వార దర్శనం భక్తులకు కల్పించేలా పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రధాన ఆలయం ముఖద్వారంతో పాటు వైకుంఠ ద్వారాన్ని సువాసనలు వెదజల్లే పరిమళ భరిత పుష్పాలు, పత్రాలతో భక్తులను ఆకట్టుకునేలా అలంకరణ చేయాలన్నారు. ప్రతి ఏటా తెచ్చినట్టుగానే దేశ, విదేశాల నుంచి పువ్వులు తీసుకురావాలని సూచించారు.

2న త్రిముఖ సినిమా విడుదల



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: త్రిముఖ ట్రైలర్ పాన్ ఇండియా వ్యాప్తంగా విశేష ఆదరణ రావడంతో అ చిత్ర యునిట్ ప్రామోషన్స్ తిరుపతిలో గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ చిత్ర హీరో యోగేష్ మాట్లాడుతూ అకిరా డ్రీమ్ క్రియేషన్స్‌లో తనతో పాటు ఆకృతి అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన త్రిముఖ సినిమా జనవరి 2న విడుదల అవుతుందని తెలిపారు. త్రిముఖ మూవీ సస్పెన్స్, సైకాలాజికల్ థ్రిలర్ మువీగా అందరినీ ఆకట్టుకుంటుందన్నారు. ఆ మూవీ ప్రొడ్యూసర్ మద్దాలి సత్య శ్రీదేవి మాట్లాడుతూ ఈ మూవిలో ఏసిపి శివాణి పాత్రలో సనీలియాన్ పర్ఫామెన్స్ విశేషంగా ఆకట్టుకుంటుందని తెలిపారు. చిత్ర డైరెక్టర్ రాజేశ్వవర్ మాట్లాడుతూ ఇది తన తొలి చిత్రం కావడంతో అందరు నచ్చే కథాంశంతో విడుదల చేయబోతున్నామన్నారు. చిత్రంలో అందరూ కొత్త వారు అయినప్పటి నటనలో విశేష ప్రతిబ కనబరిచారన్నారు. తప్పక ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. తిరుపతి నుంచి ఈ చిత్రం ప్రమోషన్ యాత్రను ప్రారంభిస్తున్నామని, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, వైజాగ్, కరీంనగర్, కర్నూలు, మీదుగా హైదరాబాద్‌కు చేరుకుంటామన్నారు. ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించి విజయవంతం చేయాలని కోరారు.

సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్లో యస్వీయూ ఛాంపియన్



ప్రజాశక్తి - క్యాంపస్ : చెన్నై, హిందూస్థాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో జరిగిన 39వ సౌత్ ఇండియన్ యూత్ ఫెస్టివల్- 2025లో యస్వీయు విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఫైన్‌ఆర్ట్స్ క్యాటగిరీలో ఓవరాల్ ఛాంపియన్‌ను కైవసం చేసుకున్నారు. విజేతలకు ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు అభినందనలు తెలిపారు. ర్యాలీలో నాల్గవ స్థానం రాగా, ఫోక్, ట్రైబల్ డాన్స్ లో మూడవ స్థానం, వాద్ వివాద్ (హిందీ వక్తృత్వం)లో నాలుగో స్థానంలో నిలిచారు. క్లాసికల్ పెర్క్యూసన్‌లో మూడో స్థానాన్ని కె.ప్రతీప్ పొందారు. క్లే మోల్డింగ్ లో కె.తేజ మొదటి స్థానం, రంగోలీలో వీరాంజనేయులు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. విద్యార్థులను సమాయత్తం చేసి, వారిని ఈ నెల 19 నుంచి 23 వరకు చెన్నైలో వివిధ పోటీల్లో పాల్గొనేలా పర్యవేక్షించిన ఎస్వీయూ కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ ను విశ్వవిద్యాలయం అధికారులు అభినందించారు.

శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పణ



పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న కాసరం హరీష్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అలిపిరిలోని శ్రీవారి పాదాల మండపంలో కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అనుబంధ ఆలయాలైన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి, శ్రీ గోదాదేవి, శ్రీ పెరియాళ్ స్వామి, ఆంజనేయస్వామి, శ్రీకృష్ణ స్వామికి తిరుపతి సరోజినీ దేవి రోడ్డులోని ఓ భక్త కుటుంబం గత 27 సంవత్సరాలుగా వైకుంఠ ఏకాదశి, ఉగాది పర్వదినాలను పురస్కరించుకుని పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గురువారం ఆ కుటుంబ సభ్యులతో కలిసి కాసరం హరీష్, రితిన్ సాయి పట్టు వస్త్రాలు, అభిషేక ద్రవ్యాలు, పుష్ప మాలలు ఆలయ షరాబు పురుషోత్తమ రెడ్డి, అర్చక స్వాములు మురళీకృష్ణ, బాలాజీలకు అందజేశారు. ఈ వస్త్రాలను శుక్రవారం అభిషేకం అనంతరం అలంకరించనున్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : వేదాంతపురంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-6 ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంధ్య నాయకత్వంలో మహిళల ఆరోగ్య సాధికారత లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య వక్తలుగా డాక్టర్ రచనా ప్రసూతి, గైనకాలజీ నిపుణురాలు, డాక్టర్ సరస్వతి మైక్రోబయాలజిస్ట్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్, ది ఫ్యామిలీ ట్రీ హాస్పిటల్ పాల్గొని రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం, ఇన్ఫెక్షన్ల నివారణ, అపోహల నివృత్తి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల శారీరక-మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచేందుకు యోగా ఫిట్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ సౌమ్య యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

నైతిక విలువలు ఎంతో ముఖ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : మానవ జీవితంలో నైతిక విలువలు ఎంతో ముఖ్యమని ప్రముఖ మోటివేషనల్ వక్త, టీటీడీ సూపరింటెండెంట్ చింతల శివకుమార్ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి అధ్యక్షతన గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రపంచమంతా ఒక కుటుంబమనే భావనను తెలియజేసేదని, సత్యం వద ధర్మం చర అనే సిద్ధాంతం పైన ఆధారపడి ఉంటుందన్నారు. ముఖ్యఅతిథి చింతల శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థినుల్లో నేటి తరానికి ఉపయోగపడే పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ డాక్టర్ స్నేహలత, డాక్టర్ జయమ్మ, రాజేంద్ర ప్రసాద్, మునీంద్ర, హరికృష్ణ, శారద, రవి, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలో విధేయులకు ప్రాధాన్యత

టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి జడపల్లి కోటేశ్వరరావు



ప్రజాశక్తి - బాలాయపల్లి : తిరుపతి పార్లమెంటు టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శిగా బాలాయపల్లి మండలం, మన్నూరుకు చెందిన జడపల్లి కోటేశ్వరరావును టీడీపీ అధిష్టానం నియమించింది. బాలాయపల్లి మండలంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి బీసీల ఓట్లు అత్యధికంగా వచ్చేందుకు కోటేశ్వరరావు కృషిని పార్టీ గుర్తించి పార్లమెంట్ స్థాయిలో పదవి కల్పించడంపై పలువురు హర్షం వ్యక్తపరిచారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ తన సేవలను పార్టీ గుర్తించి ప్రాధాన్యత కల్పించడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

క్రీడల్లో యువతకు ప్రోత్సాహం



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: యువతకు క్రీడల్లో ప్రోత్సాహం అవసరమని సిద్దేశ్వరాలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు గంగలపూడి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో గురువారం ఆయన సంకల్ప స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులున్నా సరైన ప్రోత్సాహం లేక మరుగున పడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి క్రీడాకారులను ప్రోత్సహిం చేందుకు సంకల్ప స్పోర్ట్స్ అకాడమీని శ్రీకాళహస్తిలో ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు. మరిన్ని స్పోర్ట్స్ అకాడమీలు శ్రీకాళహస్తిలో ఏర్పాటై యువ క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం సంకల్ప స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఫుట్ బాల్ టోర్నీ ప్రారంభించారు.